విగ్రహాల ఖర్చుతో మెడికల్ కాలేజీలు కట్టొచ్చు

- ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని ప్రాంతంలో నీరుకొండ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహ నిర్మాణం కోసం రూ.1750 కోట్ల ప్రజాధనాన్ని వినియోగించే బదులు అదే డబ్బుతో ప్రజలకు ఉపయోగపడే ఏడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మించొచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ పేర్కొంది. పేదల కోసం నిరంతం పాటుపడిన ఎన్‌టిఆర్ స్ఫూర్తితో మెడికల్ కళాశాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తే బాగుంటుదని ప్రభుత్వానికి ఆ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లు కె.ఎస్.లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్‌కుమార్ గుంటూరులో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం రుషికొండపై రూ.500 కోట్లతో అతిపెద్ద ప్యాలెస్ నిర్మించిందని, ఈ నిధులతో రెండు మెడికల్ కళాశాలలను నిర్మించొచ్చన్న చంద్రబాబు ప్రస్తుతం రూ.1,750 కోట్లతో ఎన్‌టిఆర్ విగ్రహ నిర్మాణానికి ఎలా పూనుకున్నారని ప్రశ్నించారు. ఈ నిధులతో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఏడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తి చేసి ఎన్‌టిఆర్ పేరు పెట్టొచ్చని సూచించారు. తమిళనాడులో ప్రభుత్వ నిధులతో కరుణానిధి విగ్రహాన్ని నిర్మించాలని ప్రయత్నిస్తే మద్రాసు హైకోర్టు, సుప్రీంకోర్టు సైతం తిరస్కరించాయని గుర్తుచేశారు. నేటి టిడిపి కూటమి ప్రభుత్వం గత 18 నెలల్లో రూ.మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి ప్రతినెలా రూ.ఏడువేల కోట్లకు పైగా వడ్డీలు చెల్లిస్తున్న నేపథ్యంలో ప్రజాధనాన్ని ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్య రంగాలపై వెచ్చించాలని హితవు పలికారు. రూ.1750 కోట్లతో రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, రక్షితనీరు, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు కల్పించవచ్చని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టల్లో వసతులను మెరుగు పరచవచ్చునని వివరించారు. సమావేశంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ధనుంజయరెడ్డి, స్టూడెంట్స్ యూనియన్ ఫర్ నేషన్ నాయకులు కె.యశ్వంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో 'అవేర్' సేవలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సీజనల్ వ్యాధులను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడానికి రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)లోని అడ్వాన్స్ వార్నింగ్ అడ్వైజరీ ఫర్ రిసిలియెంట్ ఎకోసిస్టమ్ (అవేర్) విభాగం సేవలను వినియోగించుకోనున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల ప్రకారం వ్యాధులు ప్రబలకుండా సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా అడుగులు వేస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవేర్ ద్వారా వ్యాధుల తీవ్రత, వ్యాప్తికి ఉన్న అవకాశాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వాటిని సత్వరం నివారించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులకు సంబంధించి ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలకు ఆర్‌టిజిఎస్‌లోని సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోనున్నారని వెల్లడించారు. ఈ సేవలను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై అధికారులకు సెకండరీ హెల్త్ డైరెక్టర్, వైద్య విద్య డైరెక్టర్ అవగాహన కల్పించారని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు దైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నాగోబా జాతర ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ సంప్రదాయ వేడుక నాగోబా జాతర ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ ఆదివారం రాత్రి మహాపూజతో అట్టహాసంగా ప్రారంభమైంది. ఆదివాసీ సంప్రదాయ రీతిలో సన్నాయి మోతలు, డోలు వాయిద్యాలు, దివిటీల కాంతుల మధ్య మెస్రం వంశ పెద్దల ప్రత్యేక పూజలతో మహాక్రతువు ఆధ్యంతం యాత్రికుల తన్మయత్వం మధ్య వైభవంగా సాగింది. ముందుగా గర్భాలయం వెనక ఉంచిన గంగా జలంతో శుద్ధి కార్యక్రమం చేపట్టారు. సరిగ్గా అర్ధరాత్రి ఇలవేల్పు శేషసాయికి ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావు, కటోడాలు హన్మంతు, కోసు సహా మెస్రం పెద్దలు అంతరంగికంగా అభిషేకంతో మహాపూజలు నిర్వహించారు. మెస్రం వంశీయుల దవళ వస్త్రధారణతో విద్యుత్తు కాంతుల ధగధగల మధ్య ఆలయ ప్రాంగణం తెలుపు వర్ణ శోభితమైంది. సంప్రదాయ రీతిలో మెస్రం వంశ కొత్త కోడళ్ల భేటీ జరిగింది. సతీక్ దేవత పూజలు చేసి కుల పెద్దల కాళ్లు మొక్కి ఆశీస్సులు తీసుకున్నారు. అంతకుముందు కేస్లాపూర్‌లోని పాత మందిరమైన మురాడి నుంచి నాగోబా దేవత ఆభరణాలను ఆలయానికి చేర్చారు. మెస్రం ఆడపడుచులు కొత్తకుండలతో కొనేరు నుంచి తెచ్చిన జలంతో అల్లుళ్లు, మెస్రం మహిళలు మట్టితో పుట్టలు తయారుచేసి పూజలు నిర్వహించారు.

కోడి పందేల బరి వద్ద దళితులపై దాడి

నిర్వాహకులను శిక్షించాలని సిపిఎం డిమాండ్ • బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో ఉప్పులూరు కోడి పందేల బరి వద్ద దళితులను బట్టలూడదీసి, తాళ్లతో కట్టేసి అమానుషంగా హింసించిన నిర్వాహకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్ట విరుద్ధంగా కోడి పందేలు నిర్వహించినవారిపైనా, వారిని అనుమతించిన అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు రక్షణ కల్పించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలందరూ దీనిని తీవ్రంగా నిరసించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ మాల్యాద్రి, యం హరిబాబు తదితరులు ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారని తెలిపారు.

సంక్రాంతి సందర్భంగా ఈ నెల 15న నిర్వహించిన కోడి పందేల బరి వద్ద నిర్వహించే పత్తాల ఆట కోసం నిర్వాహకులు తోట్లవల్లూరుకు చెందిన 11 మందిని కూలికోసం తీసుకువెళ్లారని, వచ్చిన డబ్బుల్లో లెక్క తేడా రావడంతో, కూలికి వచ్చినవారే ఆ సొమ్మును తీశారనే నెపంతో బట్టలూడదీసి, తాళ్లతో కట్టేసి, అత్యంత దారుణంగా, అమానుషంగా హింసించారని తెలిపారు. ఆ దారుణాన్ని వీడియో కూడా చిత్రీకరించడం వారి రాక్షసానందానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పును సైతం ధిక్కరిస్తూ, అధికార పార్టీ అండదండలతో రాష్ట్ర మంతటా బరులువేసి పందేలను నిర్వహించి కోట్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం గుడ్లప్పగించి చూసిందే తప్ప ఎక్కడా నిలువరించే ప్రయత్నం చేయలేదని అన్నారు. పైగా ప్రజా ప్రతినిధులు, మంత్రులు సైతం ప్రత్యక్షంగా హాజరై ప్రోత్సహించారని, అలాంటి ప్రజా ప్రతినిధులపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది.

అమానుషానికి పాల్పడిన వారికి కఠిన శిక్ష : వ్యకాస, కెవిపిఎస్

పని కోసం వచ్చిన బిసి, దళిత వ్యవసాయ కార్మికులను

బాధితుడు మధును పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

డబ్బుల్లో వ్యత్యాసం వచ్చిందని తాళ్లతో కట్టేసి, అర్ధనగ్నంగా ఉంచి, దుర్భాషలాడుతూ, చితకబాదిన నిర్వాహకులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో అక్రమంగా, చట్ట విరుద్ధంగా కోడి పందేలు ఆడించి, ఆపై పందెం డబ్బుల్లో వ్యత్యాసం రావడంతో అక్కడ పని చేయడానికి వచ్చిన బిసి, దళిత వ్యవసాయ కార్మికుల చేతులను తాళ్లతో కట్టేసి, అర్ధనగ్నంగా ఉంచి దుర్భాషలాడుతూ కూలీలను చితకబాదినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పామర్రి గోపిచంద్, మరో ఏడుగురు ఈ దుర్మార్గానికి పాల్పడ్డారని వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 11 మంది వ్యవసాయ కార్మికులను నిర్బంధించి డబ్బులు ఇవ్వకపోతే మీ సంగతి తేలుస్తాం, చంపేస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారని తెలిపారు. రాష్ట్రంలో రౌడీలకు, గూండాలకు, అరాచక శక్తులకు ఆస్కారం లేదని, అటువంటి వారిని రాష్ట్రం నుంచి వెలివేస్తామని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నారని, ఈ ఘటనకు ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బాధితులైన వ్యవసాయ కార్మికులకు రూ.10 లక్షలు చొప్పున పరిహారంతోపాటు, దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కోడి పందేలు నిషేధించాలని, అరాచకాలు, అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

దోషులను కఠినంగా శిక్షించాలి

కోడి పందేల బరిలో పనికి పిలిచి డబ్బులు ఎగవేతకు కుట్ర పన్ని, పని కోసం వచ్చిన వారిపైనే దొంగతనం మోపి 11 మందిని అర్ధనగ్నంగా.. చేతులు కట్టేసి దాడి చేసిన నిర్వాహకులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఇది ఆటవిక చర్యగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అభివర్ణించారు. ఈ అమానుషానికి పాల్పడిన అహంకారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలాన్ని అధికారులు వెంటనే సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

సిఎం వ్యాఖ్యలు సరికావు : సుధాకర్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హత్యా రాజకీయాలపై మాట్లాడే నైతిక హక్కు సిఎం చంద్రబాబుకు లేదని, ఎన్‌టిఆర్ వర్ధంతి సభలో సిఎం చేసిన ప్రసంగం పూర్తిగా నేలబారు రాజకీయానికి నిదర్శనమని వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్ బాబు పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ పేరును వాడుకుంటూ, ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని ఆరోపించారు. పిన్నమ్మ తాళిబొట్టు తెంచిన వారితో నేను గొడవ పడాల్సి వస్తుందని, అలాంటి వారితో రాజకీయాలు చేయాల్సి వస్తుందని' సిఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఎన్‌టిఆర్‌పై చంద్రబాబు చూపిస్తున్న ప్రేమ కేవలం నటన మాత్రమేనన్నారు. సంక్రాంతి పేరుతో టిడిపి నేతలు ప్రజాధనం లూటీ చేశారన్నారు. ఒక్క క్వార్టర్ మద్యంపై రూ.50 మార్జిన్ టిడిపి నేతలు తీసుకుని దోపిడీ చేశారని ఆరోపించారు.

'పల్నాడు' ఘటనను రాజకీయం చేస్తోన్న వైసిపి

- మంత్రులు అనగాని, గొట్టిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లాలో జరిగిన హత్యను వైసిపి రాజకీయం చేస్తోందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. పల్నాడులో జరిగిన సాల్మాన్ హత్యపై టిడిపి కార్యాలయంలో అనగాని ఆదివారం విలేకరులతో మాట్లాడగా, గొట్టిపాటి రవికుమార్ ఒక వీడియో విడుదల చేశారు. పల్నాడులో రెండు వర్గాల మధ్య ఉన్న గొడవను అందరిపై రుద్ది శవరాజకీయం చేశారని అనగాని విమర్శించారు. వైసిపి హయాంలో అనేకమంది బడుగు, బలహీన వర్గాలవారిని పొట్టన పెట్టుకున్నారని పేర్కొన్నారు. దాదాపు 700 మందికి పైగా దళితుల్ని హత్య చేశారని తెలిపారు. సంక్రాంతి పండగను అందరూ ప్రశాంతంగా జరుపుకుంటే వైసిపి నేతలు ఆ ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయడానికి పూనుకున్నారని విమర్శించారు. తుని నియోజకవర్గంలో లాలం బంగారయ్య అనే వ్యక్తిని వైసిపి నాయకులు హత్య చేశారని తెలిపారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు రాజకీయ రంగు పులిమి టిడిపిపై బురద చల్లేందుకు వైసిపి నేతలు కుట్రలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో ఫ్యాక్షన్, అక్రమ మైనింగ్‌లతో పల్నాడు ప్రాంతం వల్లకాడు అయ్యిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో పంట భూములకు నీళ్లు పారుతున్నాయని అన్నారు. జగన్ పాలనలో పిన్నెల్లిలో 12 మందిని చంపేశారని, అందులో ఎస్‌సి, బిసిలు కూడా ఉన్నారని చెప్పారు. వైసిపి హయాంలో ఊరు విడిచి వెళ్లిన వాళ్లందరూ కూటమి ప్రభుత్వంలో తిరిగి వస్తున్నారని చెప్పారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడు ప్రాంతాన్ని భగ్నం చేసేందుకు వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారని, దీనిని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

పదేళ్ల బిజెపి పాలనలో రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడి

- 25న విజయవాడలో 'భారత రాజ్యాంగం-సవాళ్లు'పై జాతీయ సదస్సు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన జన విజ్ఞాన వేదిక, ఐలు నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక సూత్రాలతో పాటు లౌకిక తత్వం, సామాజిక న్యాయం, సమాఖ్య విధానాలు, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తోందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవిఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25న 'భారత రాజ్యాంగం-సవాళ్లు'పై జన విజ్ఞాన వేదిక, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) విజయవాడ బందరు రోడ్డులోని ఎంబివికెలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నేతలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జెవివి రాష్ట్ర అధ్యక్షులు కెవిఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో భారత రాజ్యాంగం-సవాళ్లు అనే అంశంపై ఏర్పాటు చేస్తున్న జాతీయ సదస్సుకు ప్రజాస్వామిక వాదులు అత్యధిక సంఖ్యలో

సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు తదితరులు

పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 25న ఉదయం 10:30 గంటల నుంచి మొదటి సెషన్ ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి సుదర్శన్‌రెడ్డి 'భారత రాజ్యాంగం-సవాళ్లు' అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. రెండో సెషన్ ఉదయం 11:30 నుంచి 12:30 గంటల వరకు జరుగుతుందని, 'భారత రాజ్యాంగం-లౌకిక వాదం' అనే అంశంపై ముఖ్య అతిథిగా హాజరుకానున్న ప్రొఫెసరు కె నాగేశ్వర్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం ప్రారంభమయ్యే మూడో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 'భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్య హక్కులు' అనే అంశంపై ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ ప్రసంగిస్తారు. నాలుగో సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు 'భారత రాజ్యాంగం-ఫెడరలిజం' అనే అంశంపై ఐజటి స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసరు చక్కా బెనర్జీ, చివరి సెషన్ సాయంత్రం 4 గంటల నుంచి 4:30 గంటల వరకు 'శాస్త్రీయ దృక్పథం-రాజ్యాంగం' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక నాయకులు విరపు బాలసుబ్రహ్మణ్యం ప్రసంగిస్తారని లక్ష్మణరావు తెలిపారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అనుమానాస్పద మృతి

- అతిగా మద్యం సేవించడమే కారణం : డిఎస్‌పి

ప్రజాశక్తి- పీలేరు (అన్నమయ్య జిల్లా)

ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అతిగా మద్యం సేవించడమే ఇందుకు కారణమని అన్నమయ్య జిల్లా రాయచోటి డిఎస్‌పి ఎంఆర్.కృష్ణమోహన్ తెలిపారు. పీలేరులోని అర్బన్ సిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పీలేరు మండలం బండవడ్డిపల్లెకు చెందిన మణికుమార్ (35), పుష్పరాజ్ (27), శ్రావణ్, శివమణి, వేణుగోపాల్, అభిషేక్ సమీప బంధువులు. వీరిలో మణి, పుష్పరాజ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. సంక్రాంతి పండగకు స్వగ్రామానికి వచ్చిన వీరిద్దరూ మిగిలిన నలుగురితో కలిసి మద్యం సేవించేందుకు శనివారం మధ్యాహ్నం గర్నిమిట్టలోని మద్యం దుకాణంలో 19 బడ్‌వైజర్ టిన్ బీర్లు కొనుగోలు చేశారు. బండవడ్డిపల్లి సమీపంలోని గుట్టలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు బీరును సేవించారు. గుట్ట నుంచి వచ్చేటప్పుడు మణి, పుష్పరాజ్ అస్వస్థతకు గురి కావడంతో వారిద్దరినీ మిగిలిన వారు తమ కారులో గర్నిమిట్టలోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే వారి నాడి బలహీనంగా ఉండడంతో వైద్యుడి సూచన మేరకు పీలేరులోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి పీలేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే వారిద్దరూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మణి తండ్రి ఆవులకుంట నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తాము, పీలేరు ఎక్సైజ్ అధికారులు కలిసి ప్రాథమిక దర్యాప్తు నిర్వహించామని డిఎస్‌పి చెప్పారు. సాఫ్ట్‌వేరు ఇంజనీర్లు ఇద్దరూ తీసుకున్నది టిన్ బీర్లు కాబట్టి వాటిని కల్తీ చేసే అవకాశం లేదని, అతిగా మద్యం సేవించడం వల్లనే వారు మృతి చెంది ఉంటారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. అయినప్పటికీ వారు సేవించిన బీర్ల ఖాళీ టిన్లు, మిగిలిపోయిన బీర్లు, వారు తీసుకున్న ఆహార పదార్థాలను సీజ్ చేసి ఫొరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపామని చెప్పారు. మణి, పుష్పరాజ్ శరీరాల్లోని పలు భాగాలను కూడా ల్యాబ్‌కు పంపుతామని, తద్వారా వారి మరణాలకు వైద్యపరంగా శాస్త్రీయ కారణాలు వెలికి తీస్తామని చెప్పారు. వారు బీర్లను ప్రభుత్వ దుకాణం నుంచే కొనుగోలు చేశారు కాబట్టి కల్తీ జరిగే అవకాశం లేదని డిఎస్‌పి తెలిపారు. మరణించిన వారి కుటుంబసభ్యులు సైతం తమకు ఎవరి మీద అనుమానాలు లేవని తమకు తెలియజేశారని డిఎస్‌పి చెప్పారు.

రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు కిటకిట

- తిరుగు ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి- యంత్రాంగం

సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణం కావడంతో రైల్వే స్టేషన్లు, ఆర్‌టిసి బస్ స్టేషన్లు ఆదివారం కిటకిటలాడాయి. రద్దీకి తగ్గట్టుగా రైళ్లు, బస్సులు అందుబాటులో లేకపోవంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రిజర్వేషన్ లేనివారికి బస్సు, రైలులో ఎక్కడం కష్టతరం మారింది. అధిక ధర చెల్లించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. విశాఖలోని రైల్వేస్టేషన్, ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో విపరీత రద్దీ నెలకొంది. రైళ్లు, బస్సులన్నీ కిక్కిరిశాయి. టికెట్ కౌంటర్ల వద్ద భారీ క్యూలు కనిపించాయి. ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు ప్రభుత్వం రవాణా సదుపాయాలు కల్పించలేదని పలువురు వాపోయారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది.

మాట్లాడుతున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రపంచ శాంతికి చిచ్చు పెట్టేందుకు అమెరికా ప్రయత్నాలు

- ప్రపంచ శాంతి కోసం భారత్ నిలబడాలి
- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రపంచ శాంతికి చిచ్చు పెట్టేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా సిపిఎం ఉద్యమ నిర్మాత టి.నరసింహయ్య ఏడో వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలులోని బిఎస్ కల్యాణ మంటపంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రాముడు అధ్యక్షతన వెనిజులా పరిణామాలపై ఆదివారం సదస్సు నిర్వహించారు. తెలకపల్లి రవి ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ట్రంప్ ప్రపంచ టెర్రరిస్ట్ అన్నారు. ట్రంప్ చర్యలన్నింటి వెనుక ఆర్థిక ప్రయోజనాలు, ఆధిపత్యమే దాగుందని విమర్శించారు. ప్రపంచ ఆధిపత్యం కోసమే వెనిజులా అధ్యక్షులు మధురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారని, వెనిజులాను ఎదుర్కోగలిగే శక్తి అమెరికాకు లేదని, అందుకే దొంగచాటుగా మధురోను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ప్రకృతి వనరులు, సంపద అపారంగా ఉన్న దేశాల నాయకులు అమెరికాకు తలవంచకపోతే ట్రంప్ ఇలాంటి చర్యలకు దిగుతున్నారని అన్నారు. గతంలో క్యూబా అధ్యక్షులు చావెజ్‌ను కూడా అరెస్టు చేశారని, ఇతర దేశాల అధ్యక్షులను ఎత్తుకొచ్చే ట్రంప్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు, నైతికత ఉన్నాయా అని ప్రశ్నించారు. బ్రిక్స్ దేశాలు ట్రంప్‌కు లొంగేది లేదని చెబుతున్నాయని తెలిపారు. ట్రంప్ చెలరేగుతున్నా న్యూయార్క్‌లో వామపక్ష వ్యక్తి మేయర్ అయ్యాడన్నారు. ట్రంప్‌ను ఎదుర్కోడానికి భారత్ సిద్ధం కావడం లేదని పేర్కొన్నారు. ట్రంప్ చర్యల వల్ల భారత్ ప్రయోజనాలను కోల్పోతోందన్నారు. వెనిజులా పరిణామాలపై అందరూ మాట్లాడుతున్నా మోడీ మాత్రం మాట్లాడటం లేదని, ఆ విశ్వగురు ట్రంప్‌కు శిష్యుడేనని పేర్కొన్నారు. దేశాల స్వతంత్రత కోసం భారత్ నిలబడకపోవడం ప్రపంచ శాంతికి విఘాతమని విమర్శించారు. అమెరికా చర్యలు పెట్రోల్, ధరల మీద ప్రభావం చూపుతాయన్నారు. దేశంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి ప్రపంచ శాంతి కోసం భారత్ నిలబడుతుందని చాటి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎపిలో చంద్రబాబు, జగన్ నోట అమెరికా మాట రాదని, వారికి అంతర్జాతీయ విషయాలు అవసరం లేదా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రకృతిని, హక్కులను కాపాడుకోవాలంటే అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని, చైతన్యంతో కదలాలని తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ నరసింహయ్య మార్గంలో తాము నడవడం సంతోషకరమన్నారు. నరసింహయ్య అన్ని విషయాలనూ సునిశితంగా పరిశీలించే వారని, పార్టీనే వారి కుటుంబమని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ జిల్లాలో పార్టీని నడిపించాలనే ఉన్నత లక్ష్యంతో నరసింహయ్య పని చేశారన్నారు. ఆయన త్యాగాన్ని మరువకూడదని, స్ఫూర్తిగా తీసుకుని వారి లక్ష్యాన్ని ముందుకు తీసుకు పోవాలన్నారు. తొలుత నరసింహయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, కెవి.నారాయణ, జి.రామకృష్